సాక్షి
చిత్తూరు
ఆదివారం । 3 । మార్చి । 2024



తొలిపూజకు వేళాయె

శ్రీకాళహస్తి: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు శ్రీకాళహస్తి పట్టణం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది.



నేడు పల్స్‌పోలియో

జిల్లాలో ఆదివారం జరిగే పోలియో చుక్కల కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని డీఎం అండ్‌హెచ్‌ఓ ప్రభావతిదేవి అన్నారు. - IIలో



ప్రతి కుటుంబానికి 100 రోజుల పని

ఉపాధిహామీ కూలీలకు మార్చిలో 100 రోజుల పనిదినాలు కల్పించాలని డ్వామా పీడీ రాజశేఖర్ సూచించారు. - IIలో

న్యూస్‌రీల్

కొత్త చట్టాల్లో మార్పులపై శిక్షణ



చిత్తూరు డీటీసీ నుంచి శిక్షణకు హాజరైన పోలీసులు

చిత్తూరు అర్బన్: భారతీయ శిక్షాస్మృతి స్థానంలో కేంద్రప్రభుత్వం తీసుకొచ్చిన భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య అధినీయంపై పోలీసుశాఖలో తప్పనిసరిగా అవగాహన ఉండాలని తిరుపతి పోలీసు శిక్షణా కళాశాల ప్రిన్సిపల్ ఎంకె.రాధాకృష్ణ, డీఎస్పీ ఐ.రామకృష్ణ అన్నారు. శనివారం చిత్తూరు నగరంలోని పోలీసు శిక్షణా కేంద్రంలో ఉన్న అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా కొత్త చట్టాలపై సమావేశం నిర్వహించారు. పోలీసు అధికారులు మాట్లాడుతూ కొత్త చట్టాలపై పోలీసులు అవగాహన కలిగి ఉంటేనే దీన్ని సమర్థవంతంగా అమలు చేయడం సాధ్యమవుతుందన్నారు. నిందితులపై ఎఫ్ఐఆర్ నమోదు, నేర తీవ్రత, సాక్ష్యాల సేకరణ, చట్టంలో వచ్చిన శిక్షా కాలంపై విస్తృతంగా వివరించారు.

4,5 తేదీల్లో ఎన్నికల శిక్షణ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాకేంద్రంలోని జెడ్పీ సమావేశ మందిరంలో ఈ నెల 4, 5 తేదీల్లో ఎన్నికల శిక్షణకు ఇవ్వనున్నారు. ఈ మేరకు కలెక్టర్ షణ్మోహన్ క్షేత్రస్థాయి అధికారులకు ఉత్తర్వులు పంపారు. ఈ నెల 4వ తేదీన జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో శిక్షణకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. సార్వత్రిక ఎన్నికల్లో విధులు నిర్వహించనున్న సెక్టోరియల్ అధికారులకు ఈ నెల 4వ తేదీన ఉదయం 10.30 గంటలకు సంబంధిత సెక్టోరియల్ అధికారులు రిపోర్టు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 5వ తేదీన ఎంసీఎంసీ శిక్షణ మధ్యాహ్నం 12 గంటలకు, పోస్టల్ బ్యాలెట్ శిక్షణ మధ్యాహ్నం 3 గంటలకు, ఈఎస్ఎంఎస్, సీ విజిల్ శిక్షణ 11 గంటలకు నిర్వహించబడుతుందని కలెక్టర్ జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ శిక్షణకు ఎవరైనా గైర్హాజరైతే శాఖాపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నాలుగో రోజు టెట్‌కు 156 మంది గైర్హాజరు

చిత్తూరు కలెక్టరేట్ : నాలుగో రోజు నిర్వహించిన టెట్ పరీక్షకు 156 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. ఈ పరీక్షలు శనివారం చిత్తూరు జిల్లాలోని నాలుగు, తమిళనాడులోని ఒక పరీక్ష కేంద్రంలో జరిగాయి. రెండు సెషన్స్‌లో జరిగిన ఈ పరీక్షలకు 1262 మంది అభ్యర్థులు హాజరుకావాల్సి ఉండగా, 1106 మంది మాత్రమే హాజరయ్యారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని డీఈఓ దేవరాజు వెల్లడించారు.

సహిత సేవలను వినియోగించుకోండి



ఫారూక్ వివరాలు తెలుసుకుంటున్న అబ్దుల్ ఘని

చౌడేపల్లి: ప్రత్యేక ప్రతిభావంతులైన విద్యార్థుల కోసం సహిత విద్యను అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర అకడమిక్ మానిటరింగ్ అధికారి అబ్దుల్ ఘని సూచించారు. శనివారం సహిత్య విద్యలో భాగంగా హోం బేస్డ్ ఎడ్యుకేషన్‌లో భాగంగా ఫారూఖ్ ఇంటిని అధికారులతో కలిసి సందర్శించారు. ఇంటి వద్దనే ఉన్న దివ్యాంగ విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న సేవలు, సౌకర్యాలపై ఆరా తీశారు. సహిత విద్య ద్వారా ప్రత్యేక ప్రతిభావంతులు విద్యను నేర్చుకోవాలనే ఆశయంతో చర్యలు తీసుకుంటోందన్నారు. అనంతరం విద్యాశాఖ కార్యాలయాన్ని సందర్శించి టీచర్లతో సమావేశమయ్యారు. సమగ్ర శిక్ష ఐఈ ప్రభాకర్ వర్మ, ఎంఈఓలు, రీసోర్సు టీచర్లు పాల్గొన్నారు.

కన్నీటి కడలి

సముద్రం మూడు కుటుంబాల్లో తీరని శోకం మిగిల్చింది. సరదాగా సముద్రాన్ని చూసొద్దామని వెళ్లిన పలమనేరుకు చెందిన డిగ్రీ కళాశాల విద్యార్థుల్లో ముగ్గురు కడలి అలల్లో చిక్కుకున్నారు. అందులో ఒక విద్యార్థి మృతదేహం బయటపడగా, మరో ఇద్దరి కోసం కోస్టల్‌గార్డులు గాలిస్తున్నారు. మహాబలిపురంలో ఈ తీరని విషాదం చోటు చేసుకుంది. సరదాగా ఈత కొట్టేందుకు వెళ్లిన కుప్పం ద్రవిడ వర్సిటీ విద్యార్థి బావిలో చిక్కుకుని ఊపిరిరాడక ప్రాణాలొదిలాడు. ఈ విషాద సంఘటనలు విద్యార్థుల కుటుంబాల్లో తీరని శోకాన్ని మిగిల్చాయి.



మహాబలిపురం బీచ్ పోలీస్‌స్టేషన్ వద్ద టూర్‌కు వెళ్లిన విద్యార్థులు

- తమిళనాడులోని మహాబలిపురం బీచ్‌లో విహారానికి వెళ్లిన పలమనేరు డిగ్రీ కళాశాలకు చెందిన 18 మంది విద్యార్థులు
- అందులో ముగ్గురు విద్యార్థుల గల్లంతు
- ఒకరి మృతదేహం లభ్యం, మరో ఇద్దరి కోసం కోస్టల్ గార్డుల గాలింపు
- కళాశాల ప్రిన్సిపల్ అనుమతి లేకుండానే టూర్‌కు వెళ్లిన వైనం
- సరదాగా ఈతకు వెళ్లి బావిలో చిక్కుకుని కుప్పం ద్రవిడ వర్సిటీ విద్యార్థి మృతి
- జిల్లాలో తీవ్ర విషాదం నింపిన ఘటనలు



సముద్రంలో మునిగి మృతి చెందిన విజయ్(ఫైల్), గల్లంతైన మౌనేష్, ప్రభు (ఫైల్)

పలమనేరు: కళాశాలకు ఒక రోజు సెలవు రావడంతో సరదాగా సముద్రం చూద్దామని వెళ్లిన విద్యార్థుల్లో ముగ్గురిని సముద్రం ముంచేసింది. వీరిలో ఒకరి మృతదేహం లభించగా మిగిలిన ఇద్దరి కోసం గాలింపు కొనసాగుతోంది. ఈ విషాద సంఘటన తమిళనాడు రాష్ట్రంలోని మహాబలిపురం బీచ్‌లో శనివారం ఉదయం చోటు చేసుకుంది. విహారానికి వెళ్లిన విద్యార్థులంతా పలమనేరు పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుకుంటున్న విద్యార్థులు. తమ బిడ్డలు సముద్రం పాలయ్యారనే విషయం తెలిసి ఆ పిల్లల తల్లిదండ్రులు కన్నీరు మున్నీరవుతున్నారు. వివరాలిలా.. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం జిల్లాస్థాయి జాబ్‌మేళా జరిగింది. దీంతో కళాశాల ప్రిన్సిపల్ తరగతులను రద్దు చేస్తూ సెలవు ప్రకటించారు. ఉన్నట్టుండి సెలవు దొరకడంతో సరదాగా సముద్రం చూసొద్దామని శీను అనే విద్యార్థి వారి గెస్ట్ లెక్చరర్ మౌనికతో మాట్లాడాడు. అయితే ఆ గెస్ట్ లెక్చరర్ ఈ విషయాన్ని కళాశాల ప్రిన్సిపల్‌కు చెప్పకుండానే అనధికారికంగా సరే అన్నారు. వెంటనే పట్టణానికి చెందిన ఓ మినీ బస్సును అద్దెకు తీసుకుని శుక్రవారం సాయంత్రం కళాశాలలోని బీఏహెచ్(బ్యాచ్‌లర్ ఆఫ్ అనిమల్ హస్బండరీ) వొకేషనల్, బీఎస్సీ, బీకాంకు చెందిన విజయ్, మౌనేష్, ప్రభు, శ్రీవిద్య, దివ్య, ఇంద్రజ, శ్రావణి, సంతోష్, శీను, ధనుంజయరాజు, యశ్వంత్, హేమంత్, రూప, నవీన్, తేజ, వంశీ, వీరితో పాటు సందీప్, సంఘవి మొత్తం 18మంది విద్యార్థులు మహాబలిపురానికి వెళ్లారు. వీరిలో కొందరు బాలికలు పీజీలో, మరికొందరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల హాస్టల్‌లో ఉంటున్నారు. మిగిలిన వారు ప్రతి రోజు కళాశాలకు వెళ్లొచ్చేవారు. వీరు శనివారం వేకువజామున మహాబలిపురంలో అద్దెగదుల్లో బస చేసి, ఉదయాన్నే సముద్రంలోకి విహారానికి వెళ్లారు.

ముగ్గురు విద్యార్థులు అదృశ్యం..

సముద్రంలోకి దిగిన వారిలో పులిచెర్ల హరిజనవాడకు చెందిన విజయ్, బంగారుపాళెం మండలం నలగాంపల్లి సమీపంలోని కేసీ కండ్రిగకు చెందిన మౌనిష్, ప్రభు ఎంతసేపటికీ సముద్రంలో నుంచి రాలేదు. దీంతో మిగిలిన పిల్లలు ఈ విషయాన్ని అక్కడి కోస్టల్‌గార్డులకు తెలిపారు. దీంతో వారు సముద్రంలో గాలించగా విజయ్ మృతదేహం లభ్యమైంది. మిగిలిన మౌనేష్, ప్రభు కోసం సముద్రంలో గాలింపు సాగుతున్నట్టు సమాచారం. అలల తాకిడికి వీరు గల్లంతైనట్లు సమాచారం.

మరీ ఇంత నిర్లక్ష్యమా..!

పలమనేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కడపకు చెందిన మౌనిక తాత్కాలిక లెక్చరర్‌గా పనిచేస్తోంది. ఆమె సహకారంతోనే శీను అనే విద్యార్థి నాయకత్వంలో విద్యార్థులంతా టూర్‌కు వెళ్లినట్టు సమాచారం. కాగా సముద్రంలో శవమై తేలిన విజయ్, కనిపించకుండా పోయిన మౌనిష్ సైతం డేస్కాలర్లే. అయితే పులిచెర్లకు చెందిన ప్రభు మాత్రం ఇక్కడి బీసీ హాస్టల్‌లో ఉంటూ కళాశాలకు వచ్చేవాడు. అక్కడి హాస్టల్ వార్డెన్‌ను సంప్రదించగా వారి అధ్యాపకులు ఇచ్చిన లెటర్ ఆధారంగా తల్లిదండ్రులకు చెప్పగా వారు సరే అనడంతోనే ప్రభుకు అనుమతి ఇచ్చినట్లు చెప్పాడు. ఈ విషయంపై సమగ్రంగా విచారిస్తున్నట్టు కళాశాల వైస్ ప్రిన్సిపల్ డా.విజయశేఖరం తెలిపారు.

డిగ్రీ కళాశాల సందర్శన ..

పలమనేరు డిగ్రీ కళాశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు గల్లంతుపై కడప రీజనల్ జాయింట్ డైరెక్టర్ బాబు శనివారం సాయంత్రం కళాశాలకు విచ్చేశారు. జరిగిన సంఘటనపై విచారించి, నివేదికను కమిషనర్‌కు పంపనున్నట్టు తెలిపారు.

పెడకంటివారిపల్లెలో విషాదం..



సదుం: రోదిస్తున్న మృతుని అవ్వ సిద్ధమ్మ

సదుం: మండలంలోని రెడ్డివారిపల్లె పంచాయతీ పెడకంటివారి పల్లెలో విషాదం నెలకొంది. అదే గ్రామానికి చెందిన శివరాణెమ్మకు పులిచెర్ల మండలానికి చెందిన శ్రీనివాసులుతో వివాహం జరిగింది. వారికి ఇందు, ప్రభు(17) సంతానం. భర్త మృతి చెందడంతో శివరాణెమ్మ తన తల్లి సిద్ధమ్మ ఇంటిలో గత పదేళ్లుగా ఉంటోంది. ప్రభు పలమనేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మూడో సంవత్సరం చదువుతూ అక్కడే హాస్టల్‌లో ఉంటున్నాడు. శనివారం విహార యాత్రకు వెళ్లి గల్లంతు కావడంతో గ్రామంలో విషాదం నెలకొంది.



బంగారుపాళెం: విషాదంలో కేసీ కండ్రిగ గ్రామస్తులు

విషాదంలో కేసీ కండ్రిగ

బంగారుపాళెం: మహాబలిపురంలో విద్యార్థులు గల్లంతు కావడంతో బంగారుపాళెం మండలం కేసీ కండ్రిగ (కమ్మచెంగన కండ్రిగ) గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. గ్రామానికి చెందిన తులసీరామ్, లత కుమారుడు విజయ్‌కుమార్, అదే గ్రామానికి చెందిన చంద్రబాబు, రామాంజమ్మ కుమారుడు మౌనీష్ పలమనేరు పట్టణంలో డిగ్రీ చదువుతున్నారు. మహాబలిపురంలోని సముద్రంలోకి వెళ్లి ఇద్దరు విద్యార్థులు గల్లంతు కావడంతో గ్రామంలో విషాదం నిండుకుంది.

కూలీ పనులు చేస్తూ బిడ్డలను చదివిస్తూ..

తులసీరామ్, చంద్రబాబు రాళ్లు కొట్టే పనులు, భవన నిర్మాణ పనులకు వెళ్తూ పిల్లలను చదివించుకుంటున్నారు. ఇంటికి పెద్ద దిక్కుగా ఉన్న కుమారుడు ఇలా అర్ధాంతరంగా తనువు చాలిస్తాడని అనుకోలేదంటూ వాపోయారు. డిగ్రీ పూర్తి కాగానే ఏదో ఒక ఉద్యోగంలో చేరి తమ బతుకులను మార్చుతారని ఆశపడ్డామన్నారు. ఇంతలోనే ఇలా జరిగిపోయిందంటూ కన్నీరు పెట్టారు.



బంగారుపాళెం: రోదిస్తున్న విద్యార్థి తల్లి

సేద తీరేందుకు బావి వద్దకు వెళ్లి..



మృతి చెందిన సాత్విక్(ఫైల్)

గుడుపల్లె: ద్రవిడ వర్సిటీలో చదువుతున్న స్వాతిక్(23) అనే విద్యార్థి శనివారం బావిలో పడి మృతి చెందాడు. గుడుపల్లె ఎస్ఐ లక్ష్మీకాంత్ కథనం మేరకు వివరాలు.. గుంటూరు జిల్లా పెదనందీపురం మండలం నాగులపాడు గ్రామానికి చెందిన రాముల కుమారుడు స్వాతిక్ ద్రవిడ వర్సిటీలో మొదటి సంవత్సరం ఎంసీఏ చదువుతున్నాడు. శనివారం మధ్యాహ్న సమయంలో తన స్నేహితులతో కలిసి ద్రవిడ వర్సిటీకి సమీపంలోని రెండు కిలోమీటర్ల దూరంలోని తంబిగాని చెరువు పక్కన ఉన్న వ్యవసాయ బావి వద్దకు ఆరుగురు విద్యార్థులు సేద తీరేందుకు ఈత కోసం వెళ్లారు. ఈత కొడుతూ ఉండగా స్వాతిక్ బావిలోని బురదలో చిక్కుక్కున్నాడు. ఇది గమనించని మిగిలిన ఐదు గురు బావిలో నుంచి పైకి ఎక్కారు. అయితే సాత్విక్ కనబడకపోవడంతో వెతకగా బావిలో మృతి చెందాడు. గుడుపల్లె పోలీసులకు సమాచారం అందించి సాత్విక్ మృతదేహాన్ని వెలికి తీయించారు. అనంతరం శవాన్ని పోస్టుమార్టం కుప్పం ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేశామన్నారు. పోలీసులు సాత్విక్ బంధువులకు సమాచారం అందించారు.

మంచి చేస్తున్న ప్రభుత్వాన్ని ఆదరించండి



తాగునీటి సరఫరాను ప్రారంభిస్తున్న మంత్రి ఆర్‌కే రోజా

- భగీరథ ప్రయత్నంతో దామరపాకానికి తాగునీరు అందిస్తున్నాం
- మంత్రి ఆర్‌కే రోజా

నగరి : పేదల చిరునవ్వులో భగవంతున్ని చూస్తున్న నేత, మంచి జరిగింటేనే ఓటెయ్యండి అని ధైర్యంగా చెబుతున్న వ్యక్తి సీఎం జగన్‌మోహన్ రెడ్డి అని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల క్రీడాశాఖ మంత్రి ఆర్‌కే రోజా అన్నారు. శనివారం మండలంలోని దామరపాకం గ్రామంలో సచివాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మహానేత వైఎస్సార్ విగ్రహాన్ని, గడపగడపకు నిధులు రూ.10.80 లక్షల నిధులతో నిర్మించిన సిమెంటు రోడ్డును, మండల నిధులు రూ.4.50 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డును, రూ.9.52 లక్షల నిధులతో జలజీవన్ మిషన్ పథకంలో చెర్లోకండ్రిగ నుంచి టీవీ కండ్రిగ, దామపాకం, దామపాకం ఎస్టీకాలనీ, దామరపాకం దళితవాడకు పైపులైన్ ద్వారా సరఫరా చేసే మంచినీటి పథకాన్ని ఆమె ప్రారంభించారు. మూడు దశాబ్దాల తాగునీటి సమస్యను పరిష్కరించడంపై స్థానిక మహిళలు మంత్రి రోజాపై పూలవర్షం కురిపించి ఆహ్వానించారు. అనంతరం మంత్రి రోజా మాట్లాడుతూ కొండ అంచుల నుంచి తాగునీటి కోసం నాలుగు పంచాయతీలు, 16 హ్యాబిటేషన్లు దాటి 12 కిలోమీటర్ల దూరం వరకు పైపులైన్ ఏర్పాటు చేయవలసి వచ్చిందన్నారు. ఈ పథకంలో నగరి మండలంలోని బుగ్గఅగ్రహారం, దామరపాకం, నంబాకం, డి.అగరం పంచాయతీలకు నింద్ర మండలం జీఎస్ కండ్రిగ పంచాయతీకి భగీరథ ప్రయత్నంతో గ్రామాలకు తాగునీటిని తీసుకురావడం జరిగిందన్నారు. దామరపాకం సచివాలయ పరిధిలో మాత్రమే డీబీటీ, నాన్‌డీబీటీ కింద రూ.13.39 కోట్లు వెచ్చించడం జరిగిందన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని మరోసారి ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ భార్గవి, ఎంపీటీసీ జ్యోతి, మండల పార్టీ అధ్యక్షుడు సుదర్శన నాయుడు, నాయకులు హరిరెడ్డి, గణపతి శెట్టి, సునీల్ రెడ్డి, విజయ్‌రెడ్డి, ధనశేఖర్, భాగ్యరాజ్, పాండియన్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ సెకండియర్ పరీక్షలు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లావ్యాప్తంగా శనివారం ఇంటర్ సెకండియర్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. జిల్లాలోని 50 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలకు 13,800 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 13,134 మంది హాజరయ్యారు. 666 మంది విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరయ్యారని ఇంటర్‌మీడియెట్ అధికారులు వెల్లడించారు. పరీక్షల నిర్వహణ తీరును డీవీఈఓ సయ్యద్ మౌలా 07 కేంద్రాలను, డీఈసీ మెంబర్లు 9, ఫ్లైయింగ్ స్క్వాడ్ మెంబర్లు 08 సెంటర్లను తనిఖీ చేశారు. ఎటువంటి డీబార్లు జరగలేదని అధికారులు వెల్లడించారు.

రేపటి సమావేశానికి రండి

చిత్తూరు కలెక్టరేట్ : పదవ తరగతి పరీక్షల నిర్వహణపై ఈ నెల 4వ తేదీన నిర్వహించే సమావేశానికి విధులు కేటాయించిన తప్పక హాజరు కావాలని డీఈఓ దేవరాజు తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మార్చి 18వ తేదీ నుంచి ప్రారంభమయ్యే పది పబ్లిక్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ పరీక్షల నిర్వహణపై సోమవారం చీఫ్, డిపార్ట్‌మెంట్, రూట్ ఆఫీసర్స్, సీ సెంటర్ కస్టోడియన్స్‌కు సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విధులకు కేటాయించిన వారంతా తప్పనిసరిగా హాజరుకావాలని, గైర్హాజరైతే శాఖాపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లా కేంద్రంలోని పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని ఆడిటోరియంలో సమావేశం ఉంటుందని డీఈఓ తెలిపారు.

పకడ్బందీగా ఎంఎస్ఎంఈ సర్వే



కాన్ఫరెన్స్‌లో జిల్లా ప్రగతిని వివరిస్తున్న కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లావ్యాప్తంగా ఎంఎస్ఎంఈ (మైక్రో స్మాల్ అండ్ మీడియం ఎంటర్ ప్రైజెస్) సర్వే పకడ్బందీగా చేపట్టేలా చర్యలు చేపడుతున్నామని కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. సంక్షేమ, అభివృద్ధి పనుల పురోగతిపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి కలెక్టర్లతో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ జిల్లా పురోగతిని వివరించారు. జిల్లావ్యాప్తంగా మూడవ దశ రీసర్వే, 74 గ్రామాల్లో స్టోన్ ప్లాంటేషన్ పూర్తి చేయడం జరిగిందన్నారు. 20,213 ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ పూర్తి చేసినట్లు తెలిపారు. ఎన్ఆర్ఈజీఎస్‌లో 82,483 పనులు ప్రారంభించగా 42,091 పనులు పూర్తి కాగా, 40,392 పనులు జరుగుతున్నట్లు వివరించారు. ఆరోగ్యశ్రీ కార్డులు వంద శాతం పంపిణీకి చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. సచివాలయం, రైతుభరోసా, వైఎస్సార్ హెల్త్‌క్లినిక్, బీఎంసీయూ, డిజిటల్ లైబ్రరీ భవన నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేసేలా పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. జిల్లాలో ఇప్పటి వరకు 3,15,807 ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేశామని తెలిపారు. ఈ నెల 3న నిర్వహించే పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేశామని సీఎస్‌కు కలెక్టర్ వివరించారు. కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

అవగాహన శిబిరాలు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లావ్యాప్తంగా మైక్రోస్మాల్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ (ఎంఎస్ఎంఈ) పనితీరు మెరుగుదలకు నిర్వహిస్తున్న మూడు రోజుల సర్వేను పకడ్బందీగా చేపట్టాలని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు ఆదేశించారు. సర్వే నిర్వహణకు పాటించాల్సిన నియామకాలపై శనివారం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఎంఎస్ఎంఈల పనితీరు, అభివృద్ధిని వేగవంతం చేయడం కోసం రాష్ట్ర ప్రభుత్వం సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇంజినీరింగ్ అసిస్టెంట్, పట్టణ ప్రాంతాల్లో వార్డు కమిటీ సెక్రటరీలు ఈ సర్వే చేయాలని సూచించారు. ఇందులో గుర్తించే నమోదు కాని ఎంఎస్ఎంఈలకు అవగాహన శిబిరాలను నిర్వహించి నమోదు చేయడం జరుగుతుందన్నారు. తద్వార వివిధ రకాల ప్రభుత్వ ప్రోత్సాహకాలను పొందేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. మూడు రోజుల పాటు పకడ్బందీగా సర్వే నిర్వహించి పూర్తి చేయాలని ఆదేశించారు. కాన్ఫరెన్స్‌లో డీఆర్ఓ పుల్లయ్య, డ్వామా పీడీ రాజశేఖర్,అధికారులు పాల్గొన్నారు.

నేటి పల్స్‌పోలియోను విజయవంతం చేద్దాం

చిత్తూరు రూరల్: జిల్లాలో ఆదివారం జరిగే పోలియో చుక్కల కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని డీఎంఅండ్‌హెచ్‌ఓ ప్రభావతిదేవి అన్నారు. చిత్తూరు నగరంలోని తన కార్యాలయంలో శనివారం పోలియో చుక్కల కార్యక్రమ పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఆదివారం జరిగే పోలియో చుక్కల కార్యక్రమంలో 0–5 ఏళ్లలోపు పిల్లలు 2,09,971 మంది ఉన్నారని, ఇందుకోసం 2,79,400 డోసులు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. మొత్తం 5,788 కేంద్రాల్లో చుక్కలు వేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. ఆదివారం తప్పిన పిల్లలకు మరుసటి రోజు ఇంటింటికీ వెళ్లి సిబ్బంది చుక్కలు వేయాలన్నారు. ముందుగా నగరంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డీఐఓ రవిరాజు, టీబీ అధికారి వెంకటప్రసాద్, డీఎంఓ శ్రీనివాసులు, డీపీఎంఓ హర్షవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

పోటీ పరీక్షల సమాచార పత్రిక ఆవిష్కరణ

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి వరదరాజనగర్‌లోని విశ్వం విద్యాసంస్థలో శనివారం పాలిటెక్నిక్, ఏపీఆర్‌జేసీ, సైనిక్, నవోదయ తదితర ప్రవేశ పరీక్షలకు సంబంధించిన సమాచార పత్రికను ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి శనివారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ గత 33ఏళ్లుగా జాతీయ, రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించేలా విద్యార్థులను తీర్చిదిద్దుతూ వారికి బంగారు భవిష్యత్‌ను విశ్వం విద్యాసంస్థ అందిస్తోందని కొనియాడారు. విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ 2023 పాలిసెట్ ఫలితాల్లో తమ విద్యార్థిని ఎ.చరిత 119/120మార్కులతో మొదటి ర్యాంకు, ఏపీఆర్‌జేసీ ఫలితాల్లో తనూజ, భువనేశ్వర్‌రెడ్డి రాష్ట్ర స్థాయిలో ప్రథమ ర్యాంకు, సైనిక్ ఫలితాల్లో వివిధ విభాగాలకు గాను రాష్ట్ర స్థాయిలో 3 ప్రథమ ర్యాంకులతో విశ్వం విద్యార్థుల విజయభేరి మోగించారని తెలిపారు. పోటీ పరీక్షలకు సంబంధించి మరింత సమాచారానికి 86888 88802, 93999 76999 నంబర్లలో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో విశ్వం విద్యాసంస్థ అకడమిక్ డైరెక్టర్ ఎన్.విశ్వచందన్ రెడ్డి, కరస్పాండెంట్ ఎస్.తులసి, కడప కార్పొరేటర్ శ్రీదేవి పాల్గొన్నారు.

తిరుచ్చిపై శ్రీవారి కటాక్షం


తిరుచ్చిపై కటాక్షిస్తున్న శ్రీవారు

పుత్తూరు: అప్పలాయగుంట ప్రసన్న వేంకటేశ్వరస్వామి తిరుచ్చిపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. శ్రీవారి గ్రామోత్సవంలో భాగంగా శనివారం వేకువజామున సుప్రభాత సేవతో శ్రీనివాస స్వామిని మేల్కొలిపి, నిత్య కైంకర్యాలు నిర్వహించారు. సాయంత్రం ఉభయ నాంచారుల సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామిని, పట్టు పీతాంబరాలు, విశేష స్వర్ణాభరణాలు, సుగంధ పరిమళభరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి ఊయలలో కొలువుదీర్చారు. భక్తి కీర్తనల నడుమ శ్రీవారి ఊంజల్‌సేవ కనుల పండువగా జరిగింది. అనంతరం సర్వాలంకార భూషితుడైన శ్రీవారు ఉభయ దేవేరీలతో కలిసి తిరుచ్చి వాహనంపై కొలువుదీరారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ మాడవీధుల్లో విహరించారు. ఈ సందర్భంగా భక్తులు నారికేళ, కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

ప్రతి కుటుంబానికి 100 రోజుల పని


రికార్డులను పరిశీలించి, సూచనలిస్తున్న డ్వామా పీడీ రాజశేఖర్

చౌడేపల్లె: ఉపాధిహామీ పనులకు వచ్చిన ప్రతి కూలీ కుటుంబానికి మార్చి నెలాఖరులోపు 100 రోజులు పనిదినాలు కల్పించాలని డ్వామా పీడీ రాజశేఖర్ సూచించారు. శనివారం మండలంలోని పుదిపట్ల పంచాయతీలో జరుగుతున్న ఫారంపాండ్ పనులను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం భూగర్భ జలవనరులను పెంచడంతో పాటు ఆర్థిక వనరులు కల్పించడానికి సన్న, చిన్నకారు రైతులను ప్రోత్సహిస్తోందన్నారు. మామిడి, జామ, సపోట, నేరేడు, సీతాఫలం వంటి 13 రకాల పండ్ల తోటల పెంపకంతోపాటు మునగ, పూల మొక్కలు, రోజా, మల్లె, డ్రాగన్ ఫ్రూట్‌లను పెంచుకోవచ్చని సూచించారు. అలాగే గంగవరం మండలంలో రోజా చెట్లు పెంపకం పనులను, ఫారంపాండ్ పనులను తనిఖీ చేశారు. డ్వామా ఏపీడీ నీలిమ, ఏపీఓ మురగేష్, జేఈలు, టీఏలు ఉన్నారు.

అంతర్రాష్ట్ర కాపర్ దొంగల అరెస్ట్


కాపర్ దొంగలను అరెస్ట్ చూపుతున్న పోలీసులు

పలమనేరు: రైతుల పొలాల్లో ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి అందులోని రాగి వైరును చోరీ చేసే ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగలను పలమనేరు పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. స్థానిక సీఐ చంద్రశేఖర్ తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని తమిళనాడు సరిహద్దు కాలువపల్లి వద్ద అనుమానంగా బైక్‌పై వెళ్తున్న ముగ్గురు వ్యక్తులను పట్టుకుని తనిఖీ చేయగా వారి వద్ద కాపర్ వైరు బయటపడింది. వారిని విచారించగా అసలు విషయం వెలుగు చూసింది. తమిళనాడు రాష్ట్రం ఆంబూరుకు చెందిన ఉస్మాన్(62), పేర్నాంబట్‌కు చెందిన కుమార్(33) గత కొన్నాళ్లుగా పలమనేరు ప్రాంతంలో ట్రాన్స్‌ఫార్మర్లను పగులగొట్టి కాపర్ చోరీ చేస్తున్నట్టు తేలింది. వీరి వద్ద సంచిలో ఉన్న పది కిలోల కాపర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీరు ఎక్కువ డబ్బు సంపాదించాలనే ఆశతోనే ఇలా ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసిసి అందులోని రాగివైరును అడవుల్లో దాచి ఆపై తమిళనాడులో విక్రయిస్తున్నట్టు నిందితులు తెలిపినట్టు సీఐ తెలిపారు. దీంతో బైక్‌తో పాటు నిందితులను అరెస్ట్ చేసి రిమాండుకు తరలించారు. కాగా వీరిపై ఇప్పటికే గంగవరం, వీకోట, సోమల పోలీసుస్టేషన్లలో పలు కేసులు ఉన్నట్టు ఆయన తెలిపారు. ఎస్‌ఐ శివశంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రవేశ పరీక్ష లేకుండా నేరుగా అడ్మిషన్లు

చిత్తూరు కలెక్టరేట్: ప్రవేశ పరీక్ష లేకుండా నేరుగా అడ్మిషన్లు చేసుకోనున్నట్లు మైనారిటీ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ ఆంజనేయులు తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాకేంద్రానికి సమీపంలో పెనుమూరు క్రాస్ వద్ద ఉన్న మైనారిటీ బాలికల గురుకుల పాఠశాలలో అనేక సౌకర్యాలున్నట్లు వెల్లడించారు. తమ పాఠశాలలో ముస్లిం మైనారిటీ బాలికలకు ఎటువంటి ప్రవేశ పరీక్ష లేకుండా నేరుగా మే 1వ తేదీ నుంచి 5, 6, 7, 8 తరగతుల్లో అడ్మిషన్ కల్పించడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని ముస్లిం మైనారిటీలు వినియోగించుకోవాలని ఆయన కోరారు.

ఘనంగా పీఈఎస్ స్నాతకోత్సవం


జ్యోతి ప్రజ్వల చేస్తున్న పీఈఎస్ వ్యవస్థాపకులు ఎంఆర్ దొరస్వామి

గుడుపల్లె : సమాజానికి ఎంతో ఉపయోగపడే నాణ్యమైన విద్యను అందించడమే పీఈఎస్ లక్ష్యమని పీఈఎస్ వ్యవస్థాపకులు ప్రో ఎంఆర్ దొరస్వామి అన్నారు. శనివారం పీఈఎస్ ఆడిటోరియంలో 16వ స్నాతకోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. మూడు రాష్ట్రాల సరిహద్దులోని కుప్పంలో పీఈఎస్ మెడికల్ కళాశాల, ఆస్పత్రిని ఏర్పాటు చేయడంతో ఇక్కడ ప్రజలకు ఎంతో ఉపయోగపడుతోందన్నారు. అనంతరం బెంగళూరు నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ సైన్స్ డైరెక్టర్ డాక్టర్ ప్రతిమ మూర్తి మాట్లాడుతూ వైద్య విద్యార్థులు క్రమశిక్షణతో రోగులకు వైద్యం అందించాలన్నారు. అనంతరం పీఈఎస్‌లో ఎంబీబీఎస్ పూర్తి చేసిన 162 మందికి, వైద్య విద్యలో పీజీ చేసిన 89 మందికి పట్టాలు అందించారు. కార్యక్రమంలో పీఈఎస్ మెడికల్ డైరెక్టర్ సురేష్‌కృష్ణమూర్తి, ప్రిన్సిపల్ కృష్ణారావు, సూపరింటెండెంట్ సుబ్రమణ్యం పాల్గొన్నారు.

ప్రమాణం చేసేందుకు సిద్ధమవుతుండగా..


నగలు, నగదును అందుకుంటున్న శంకరప్ప

చౌడేపల్లె: సత్యప్రమాణాలకు నిలయమైన రాజనాలబండ వీరాంజనేయస్వామి మహిమతోనే చోరీ అయిన బంగారు నగలు, నగదు తిరిగి లభ్యమయ్యాయని బాధితుడు శంకరప్ప తెలిపారు. శనివారం రాజనాల బండకు చేరుకుని స్వామివారి పాదాల చెంత నగలను పెట్టి ప్రత్యేక పూజలు చేశారు. ఆయన తెలిపిన వివరాలిలా.. పుంగనూరు మండలం వేపమాకులపల్లెకు చెందిన ఎం.శంకరప్ప ఇంట్లోకి గత నెల 26వ తేదీ గుర్తుతెలియని వ్యక్తులు వచ్చి బీరువాలోని నగలు 20 గ్రాములు, నగదు రూ.10 వేలు నగదు చోరీ చేశారు. దీనిపై శంకరప్ప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయింది. దీంతో పెద్దమనుషుల చేత పంచాయతీ పెట్టించి రాజనాల బండలో ప్రమాణం చేయాలని తీర్మానించారు. శనివారం ప్రమాణానికి బయలుదేరాల్సి ఉండగా ఇంటి ఆవరణలో నగలు, నగదు ప్రత్యక్షమయ్యాయి. అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి ఆయన ఆలయానికి చేరుకుని పూజలు చేశారు. అనంతరం ఆ నగలను స్వామివారి పాదాల చెంత నుంచి ఆలయ ఇన్‌స్పెక్టర్ భానుప్రకాష్, గ్రామస్తులతో కలిసి అందజేశారు.

ఇద్దరు అరెస్ట్


నిందితుల అరెస్ట్ చూపుతున్న సీఐ, ఎస్‌ఐ

పుంగనూరు: కర్ణాటక నుంచి అక్రమంగా మద్యం రవాణా చేస్తున్న ఇద్దరిని పట్టుకుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ రాఘవ రెడ్డి తెలిపారు. శనివారం సాయంత్రం విలేకరుల సమావేశంలో సీఐ మాట్లాడారు. తమకు అందిన సమాచారం మేరకు ఎస్‌ఐ సుకుమార్ ఆధ్వర్యంలో కర్ణాటక నుంచి ద్విచక్రవాహనంలో కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లు తీసుకొస్తున్న సింగిరిగుంట గ్రామానికి చెందిన వెంకటేష్, నాగరాజును వల పన్ని పట్టుకున్నట్లు చెప్పారు. వారి వద్ద ఉన్న టెట్రాప్యాకెట్లను స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసి, అరెస్ట్ అనంతరం రిమాండ్‌కు తరలించామన్నారు. మద్యం రవాణాపై సమాచారం అందించాలని కోరారు.

ఆర్మీలో పోస్టులకు దరఖాస్తులు

చిత్తూరు కలెక్టరేట్ : ఇండియన్ ఆర్మీ అగ్నివీర్‌లో వివిధ పోస్టులకు అర్హులైన వారు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా సైనిక సంక్షేమ శాఖ అధికారి విజయశంకర్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పోస్టులకు దరఖాస్తు చేసుకునేందుకు ఎనిమిదో తరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ విద్యార్హతతో పదిహేడున్నర సంవత్సరాల నుంచి 21 సంవత్సరాల వయసు కలిగిన వారు అర్హులన్నారు. టెక్నికల్, జనరల్ డ్యూటీ, నాన్ టెక్నికల్, స్టోర్ కీపర్, ట్రేడ్స్‌మెన్ పోస్టుల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారని చెప్పారు. ఇతర వివరాలకు 0863–2230008 నంబర్‌లో, డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. జేఓఐఎన్ఐఎన్‌డీఐఏఎన్ఏఆర్ఎంవై.ఎన్ఐసీ.ఇన్ (www.ojinindianarmy.nic.in)వెబ్‌సైట్‌లో సంప్రదించాలన్నారు. దళారుల వలలో పడొద్దని ఇండియన్ ఆర్మీ నియామకాలు పూర్తిగా ప్రతిభ ఆధారంగా, నిష్పక్షపాతంగా జరుగుతాయని వెల్లడించారు.